క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

కంటి పరీక్షలకు 93 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులతో కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 161 మంది వచ్చారు. వీరికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 95 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

చిత్తూరును అభివృద్ధి చేయండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరానికి వందేళ్ల చరిత్ర ఉందని, అలాంటి చిత్తూరును అభివృద్ధి చేయాలని సీఎస్‌సీడీఎస్(చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్) సభ్యులు ఆదివారం కుప్పంలోని ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించారు. జిల్లా విభజన తర్వాత చిత్తూరుకు మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ లేవన్నారు. చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరించాల్సి ఉందన్నారు. అడవిపల్లె ప్రాజెక్టుపై దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో సభ్యులు తాండవమూర్తి, సత్య, మురళీ, సందీప్ తదితరులున్నారు.

అమ్మవారి సేవలో జిల్లా జడ్జి


ఆలయం వద్ద జిల్లా జడ్జి అరుణ సారిక

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మను జిల్లా జడ్జి అరుణసారిక ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆలయ మర్యాదలతో జడ్జికి స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం పలికారు.

27 నుంచి మహా కుంభాభిషేకం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేక పూజలను ఈనెల 27నుంచి 30వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. నాలుగు రోజులపాటు జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ పూజలు అత్యంత వైభవంగా ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు.



వికసించిన మే పుష్పం

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరిలో ఓ ఇంటి పెరటిలో శనివారం మే పుష్పాలు వికసించాయి. మాజీ సమితి అధ్యక్షులు తులసీరామకృష్ణారెడ్డి ఇంటి ఆవరణలోని పెరటి తోటలో మే పుష్పాలు పూశాయి. ఏడాదిలో మే నెలలో మాత్రమే ఈ పుష్పాలు పూయడం విశేషం. చుట్టు పక్కల వారు ఈ మే పుష్పాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

వేడుకగా అర్జున తపస్సు

గుడిపాల మండలం పిళ్లారికుప్పంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జున తపస్మాన్ వేడుకగా సాగింది. ఆదిపరాశక్తి తమిళ నాట్య కళామండలి అర్జున వేషధారి ప్రతి మెట్టుకూ పరమశివుడిని వేడుకుంటూ పద్యాలు ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. అనంతరం సంతానం లేని మహిళలు తపస్సుమానువద్ద వరపడి సంతాన ప్రాప్తి కోసం వేడుకున్నారు. అర్జునుడు తపస్మాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. తపస్సుమాను ఘట్టానికి ఉభయదారుగా ఆరుముగం వ్యవహరించారు. సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. – గుడిపాల


తపస్మాన్ ఘట్టాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు


తపస్మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

నాడు ఆదర్శం–నేడు అంధకారం

- పాఠకుల ఆదరణ కోల్పోయిన గ్రంథాలయం
- కానరాని గ్రంథాలయ వారోత్సవాలు, వేసవి శిక్షణతరగతులు
- గ్రంథాలయంలో మూలకు చేరిన టీవీ, కంప్యూటర్లు
- పట్టించుకోని జిల్లా అధికారులు, పాలకులు



మండల కేంద్రంలోని తవణంపల్లె శాఖా గ్రంథాలయం

తవణంపల్లె: మండల కేంద్రంలోని నడిబొడ్డులో చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న గ్రంథాలయం దుస్థితికి చేరుకుంది. జిల్లాలో నాడు ఆదర్శంగా ఉన్న గ్రంథాలయం నేడు అంధకారంగా మారింది. గ్రంథాలయ అధికారి లేకపోవడంతో గ్రంథాలయం గురించి పట్టించుకొనే వారు లేక పాఠకుల ఆదరణ కోల్పోయింది. ఆదర్శ గ్రంథాలయం గురించి జిల్లా అధికారులు, పాలకులు(ప్రజాప్రతినిధులు) సైతం పట్టించుకోకపోవడంతో స్థానిక పాఠకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు గ్రంథాలయంలో..

1986 నుంచి 2013 వరకు విధులు నిర్వర్తించిన గ్రంథాలయ అధికారి మధుబాబు దాతల సహకారంతో గ్రంథాలయాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన సౌకర్యాలతో పాటు అన్ని రకాల కథల పుస్తకాలు, పురాణ గ్రంథాలు, విద్యార్థులకు ఉపయోగకరమైన స్టడీమెటీరియల్స్, గ్రూప్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు సైతం సేకరించి అందుబాటులో ఉంచారు. దీనితో పాటు టీవీ, కంప్యూటర్లు, ఏసీ, వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. అదే విధంగా దాత భాస్కర్‌నాయుడి ఆర్థిక సహాయం రూ.7 లక్షల వ్యయంతో మొదట అంతస్తుపై స్మారక డిజిటల్ గ్రంథాలయ భవనం కూడా నిర్మించారు. ప్రస్తుతం గ్రంథాలయంలోని పరికారాలు మూలనపడి శిథిలావస్థకు చేరుకున్నాయి.

కానరాని వేసవి శిక్షణా తరగతులు

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే తవణంపల్లె శాఖ గ్రంథాలయంలో విధులు నిర్వర్తిస్తున్న గ్రంథాలయ అధికారి సుబ్రమణ్యం 2021లో పెనుమూరుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రంథాలయ అధికారిని నియమించలేదు. దీంతో గ్రంథాలయాన్ని పట్టించుకునేవారు లేక దుస్థితికి చేరుకుంది. దాతల సహకారంలోనూ ఏర్పాటు చేసిన విలువైన వస్తువులు వినియోగించక మూలనపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ర్యాకుల్లో నిల్వ ఉన్న పుస్తకాలు సైతం పురుగులు తినేసి పాడైపోతున్నాయి.

గ్రంథాలయ అధికారిని నియమించాలి

తవణంపల్లె శాఖా గ్రంథాలయాన్ని జిల్లా అధికారులు పరిశీలించి గ్రంథాలయ అధికారిని నియమించాలని స్థానికులు, పాఠకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోనే ఆదర్శంగా రూపుదిద్దుకున్న గ్రంథాలయంపై జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై మండిపడుతున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మండల అధికార పార్టీ(కూటమి) నాయకులు, జిల్లా గ్రంథాలయ అధికారులు వెంటనే స్పందించి తవణంపల్లె గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని, గ్రంథాలయ అధికారిని నియమించాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు వేదగిరివారిపల్లెలో వైద్య శిబిరం

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

2 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం


బొమ్మసముద్రం జూనియర్ కళాశాల

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో జూన్ 2వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా బైపీసీ గ్రూపు అందుబాటులో వచ్చిందని వెల్లడించారు. నాడు–నేడు ద్వారా కళాశాలలోని మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, కళాశాల గదులన్నీ మరమ్మతులు చేసి సరికొత్త హంగులతో తీర్చిదిద్దినట్లు వివరించారు. దీంతోపాటు కొత్తగా రూ.20 లక్షలతో ప్రహరీగోడను నిర్మించినట్లు ఆయన తెలియజేశారు.

రమణీయం.. సీతారాముల కల్యాణోత్సవం



మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకులు, సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని కుమ్మరపల్లెలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకోదండరామచంద్ర ఆలయం వార్షికోత్సవంలో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి వారి మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు చేపట్టారు. రాత్రి సీతారాముల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా సీతారాముల పరిణయాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిపై స్వామి, అమ్మవారిని కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన నడుమ గ్రామోత్సవాన్ని చేపట్టారు. భక్తులు సీతారామస్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పొన్నియమ్మ జాతర


ఊరేగుతున్న పొన్నియమ్మ అమ్మవారు

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లెలో ఘనంగా పొన్నియమ్మ జాతర నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అంబలి పోశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని ఊరేగించారు.

రమేష్‌బాబు సేవలు ప్రశంసనీయం


రమేష్‌బాబును సన్మానిస్తున్న అతిథులు

గుడిపాల: రమేష్‌బాబు సేవలు ప్రశంసనీయమని రిటైర్డ్ చిత్తూరు రెండవ డిపో మేనేజర్ వెంకట రమణనాయుడు అన్నారు. మండలంలోని కమ్మతిమ్మాపల్లెకు చెందిన వాసిరెడ్డి రమేష్‌బాబు ఆర్టీసీలో 38 ఏళ్ల సేవలందించి, నేడు విరమణ పొందారన్నారు. చిత్తూరులోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఉద్యోగంలో టైమింగ్స్ మెయింటెనెన్స్ చేయడం రమేష్‌బాబుకు సాటి రారని చెప్పారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రతి ఒక్కరూ పనిచేసినట్లయితే ప్రతి ఒక్క ఉద్యోగికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్లేట్ కళాశాల అధినేత వాసిరెడ్డి అమరనాథ్, జగన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెన్నకేశవులునాయుడు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. డాక్టర్‌తో పాటు వైద్య సిబంది గ్రామంలోకి వచ్చి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు భాష గొప్పతనాన్ని మర్చిపోకూడదు


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులు తెలుగుభాష గొప్పతనాన్ని మర్చిపోకూడదని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత సూచించారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు తెలుగు గుణింతాలు, పద్యాలు నేర్పించడం, పుస్తక పఠనం, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగును మర్చిపోకూడదన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. పుస్తక పఠనం అలవాటు చేసుకుని మేధాశక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. అంతేగాకుండా వార్తా పత్రికలు, మ్యాగ్జైన్‌లు చదువుకొని రోజువారీ విషయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయం నిర్మాణం పూర్తయ్యేదెన్నడో ?


అర్థంతరంగా నిర్మాణం ఆగిపోయిన సచివాలయ భవనం

గుడిపాల: మండలంలోని బసవాపల్లె గ్రామ సచివాలయ భవన నిర్మాణం అర్థాంతరంగా నిలిచింది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణ పనులు ప్రారంభం కాగా, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులకు విరామం వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చొరవ చూపడం లేదు. పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా సచివాలయ సేవలు అందిస్తున్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

భూసార పరీక్ష కేంద్రానికి మరమ్మతులు


భూసార పరీక్ష కేంద్రం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మామిడికాయల మార్కెట్‌లోని భూసార పరీక్ష కేంద్ర మరమ్మతు పనులను అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ నెలాఖరుకు మరమ్మతు పనులు పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. వచ్చేనెల నుంచి కేంద్రంలో భూసార పరీక్షలు ప్రారంభం చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మట్టి నమూనా సేకరణ కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో భూసార పరీక్ష ఫలితాలను రైతులకు త్వరితగతిన అందించాలనే ప్రయత్నంలో ఉన్నారు. మరమ్మతులకు గాను ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రేసుకుక్కలా... చిరుతలా?


వ్యవసాయ పొలాల్లో ఉన్న పాదముద్రలు

గుడిపాల: మండలంలోని చిరుత సంచరిస్తోందా లేక రేసుకుక్కలా అన్న భయం బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట గ్రామస్తులను కుదిపేస్తోంది. జంతువుల అడుగుజాడలను కనిపెట్టి అటవీశాఖ అధికారులకు పంపినా వారు ఏ మాత్రం పట్టించుకోలేదు. మరికొంత మంది రైతన్నలు వాటి అడుగుజాడల్ని కనిపెట్టి కొంతమంది యూట్యూబ్‌లో చెక్‌చేసి చిరుతపులి సంచరిస్తోందంటూ వారికి సమాచారం అందించారు. మూడు రోజుల క్రితం గట్రాళ్లమిట్టకు చెందిన వ్యక్తి బొమ్మనాయనిచెరువు సమీపంలోని కోతికొండ వద్ద మేకలు మేపుతుండగా మూడు మేకలను గొంతు కొరికి చంపేశాయి. ఇందులో ఓ మేకను తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో పొలాల వద్దకు పాడి పశువులను తీసుకువెళ్లడానికి కూడా రైతులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

క్రికెట్ విజేతగా తిరువణంపల్లె జట్టు


విజేతగా నిలిచిన తిరువణంపల్లె జట్టు

ఐరాల: మండలంలోని చిగరపల్లె క్రీడా మైదానంలో నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో తిరువణంపల్లె జట్టు విజేతగా నిలిచింది. టైగర్ లెవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో పైపల్లె జట్టుపై తిరువణంపల్లె జట్టు విజయం సాధించి విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.8 వేలు అందజేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


దుర్యోధన ప్రతిమ మట్టి కోసం ఎగబడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాభారత యజ్ఞంను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని బండపల్లిలో సోమవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత నాట్య మండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ధర్మరాజుల ఆలయం ఆవరణలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు జరిపారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధసన్నివేశాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గదతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పూసే సన్నివేశాల్లో పాత్రధారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. తర్వాత దుర్యోధనుడి మట్టి కోసం గ్రామస్తులు ఎగబడ్డారు. సాయంత్రం అగ్గి తొక్కే కార్యక్రమాన్ని చేపట్టి మహాభారత పర్వాన్ని ముగించారు.